
**బల్దియాలో ఇష్టారాజ్యం** 2



**గాంధారిలో పోలీసు కవాతు** 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## 14న రెండో విడత ఎన్నికలు

**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. ఇందులో భాగంగా నిజామాబాద్ డివిజన్‌లోని 7 మండలాలు, ఆర్మూర్ డివిజన్‌లోని ఒక మండలంలో పోలింగ్ జరగనుంది. నిజామాబాద్ డివిజన్‌లోని ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్, సిరికొండ, ఆర్మూర్ డివిజన్‌లో జక్రాన్‌పల్లి మండలాల్లో మొత్తం 196 సర్పంచ్ స్థానాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 38 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో 158 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అలాగే 1,760 వార్డు స్థానాలకు గాను 674 మంది అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 1,081 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం మొత్తం 1,476 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. 8 మండలాల్లో 2,38,838 మంది ఓటర్లు ఉన్నారు.



## ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా ఏర్పాట్లు చేయాలి



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలని సీపీ సాయిచైతన్య సూచించారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిజామాబాద్ డివిజన్ పరిధిలో జరగనున్న నేపథ్యంలో శుక్రవారం డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని తూ.చా. తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రధానంగా నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యాత్మకమైన, అతిసమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లను గుర్తించి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని ఆదేశించారు.

### మార్కింగ్ వేయాలి

ప్రతీ పోలింగ్ కేంద్రానికి నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి, ప్రచారం, గుర్తులను ప్రదర్శించకుండా నివారించాలని సీపీ సూచించారు. అవసరాన్ని బట్టి స్ట్రైకింగ్ ఫోర్స్ సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగడానికి వీల్లేకుండా అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్, సురేష్, వినోద్, భిక్షపతి, ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, డిచ్‌పల్లి ఎస్సై ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.


## రైల్వే వంతెన నిర్మాణ స్థలాల పరిశీలన



**అక్షరటుడే, కామారెడ్డి:** రెండు రోజుల క్రితం రైల్వే శాఖ మంత్రిని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి కలిసి పలు వంతెనల నిర్మాణానికి నిధులివ్వాలని కోరిన విషయం తెలిసిందే. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం కామారెడ్డిలో పర్యటించారు. చీఫ్ ఇంజనీర్ కనస్ట్రక్షన్ అమిత్ అగర్వాల్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ నవశ్రీ, సీనియర్ డెన్ కనస్ట్రక్షన్ దుర్గాప్రసాద్, నార్త్ డెన్ కనస్ట్రక్షన్ శశాంత్ నాందేవ్, డెన్ నిజామాబాద్ శంభు దయాల్ మీనా, కనస్ట్రక్షన్ నిజామాబాద్ ధర్మారావుల బృందం శుక్రవారం రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఆర్వోబీ కోసం అధికారులు ప్రాథమికంగా స్థల పరిశీలన చేపట్టారు. వారికి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి దగ్గరుండి మరీ మ్యాప్ ద్వారా వంతెన అవసరాన్ని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో పెరిగిన రద్దీ దృష్టిలో పెట్టుకొని వాసవి స్కూల్ వద్ద, వికాస్ నగర్ కాలనీ వద్ద, పాత రాజంపేట వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, ప్రియ థియేటర్ రోడ్డులో ఫుట్ ఓవర్ బ్రిడ్జి అవశ్యకత గురించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు వివరించినట్లు తెలిపారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని, సాధ్యమైనంత తొందరగా పనులు ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారని చెప్పారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం జరిగితే ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

- మొదటి విడతలో మెజారిటీ స్థానాలు కైవసం
- సంక్షేమ పథకాలపై ప్రజల తీర్పు అంటున్న నాయకులు
- రెండు, మూడో దశ పంచాయతీ ఎన్నికలపై ఫోకస్



**ఉమ్మడి జిల్లాలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటింది. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. పంచాయతీ ఎన్నికలు గురువారం మధ్యాహ్నం వరకు జరగ్గా.. పలు గ్రామాల్లో రాత్రి వరకు కౌంటింగ్ ప్రక్రియ సాగింది. అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.**

**-అక్షరటుడే, కామారెడ్డి**

పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తు లేకపోయినా.. ఆయా పార్టీల మద్దతుతో అభ్యర్థులు పోటీలో నిలిచారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో చాలా గ్రామాల్లో ప్రజలు హస్తం పార్టీ అభ్యర్థులను గెలిపించారు. జిల్లాలోని భిక్కనూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలలో 11 స్థానాలు హస్తం పార్టీ గెలుచుకుంది. బీబీపేట మండలంలో 11 స్థానాలకు 4, దోమకొండ మండలంలో 9 జీపీలలో 3 పంచాయతీలు, కామారెడ్డి మండలంలో 14 గ్రామాల్లో 7, మాచారెడ్డి మండలంలో 25 జీపీల్లో 18, పాల్వంచ మండలంలో 12 గ్రామాలు ఉండగా ఆరు చోట్ల గెలుపొందింది. తొలిదశలో 167 పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. 80 స్థానాలలో కాంగ్రెస్ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు.

### గట్టి పోటీనిచ్చిన బీఆర్ఎస్

పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చింది. అధికారంలో లేకున్నా.. ఆ పార్టీ అభ్యర్థులు సైతం చాలా గ్రామాల్లో విజయం సాధించారు. బీఆర్ఎస్ రెండు, బీజేపీ మూడో స్థానంలో నిలిచాయి. అయితే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్మినట్టుగా తెలుస్తోంది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి తమను గెలిపించాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.

### నిజామాబాద్ జిల్లాలో...

జిల్లాలో 11 మండలాల్లో మెజారిటీ స్థానాలు అధికార పార్టీ కైవసం చేసుకుంది. బోధన్ మండలంలో 26 జీపీలకు కాంగ్రెస్ 17, బీఆర్ఎస్ 5 స్థానాల్లో గెలుపొందాయి. రెంజల్ మండలంలో 17 జీపీల్లో కాంగ్రెస్ 8, బీజేపీ, బీఆర్ఎస్ చెరో రెండు చోట్ల, రుద్రూర్ మండలంలో 11 పంచాయతీల్లో కాంగ్రెస్ 8 స్థానాలు, వర్నిలో 23 జీపీల్లో ఎన్నికలు జరగగా కాంగ్రెస్ 21 స్థానాలు కైవసం చేసుకుంది. చందూరు మండలంలో 5 జీపీల్లో కాంగ్రెస్ 3 స్థానాలు, మోస్రా మండలంలో 5 జీపీలకు కాంగ్రెస్‌కు 2 స్థానాలు, నవీపేటలో 32 స్థానాలకు కాంగ్రెస్ 20, బీజేపీ, బీఆర్ఎస్ చెరో మూడు స్థానాలు కైవసం చేస్తున్నాయి. సాలూర మండలంలో 12 సర్పంచ్ స్థానాలకు గాను కాంగ్రెస్ 7 స్థానాలు, కోటగిరి మండలంలో మొత్తం 16 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందింది. ఎడపల్లిలో 17 గ్రామపంచాయతీలో కాంగ్రెస్ 12 స్థానాలు, పోతంగల్‌లో 20 జీపీలకు కాంగ్రెస్ 17 బీజేపీ మూడు స్థానాల్లో గెలుపొందాయి.

### ఎంపీటీసీ, జెడ్పీటీసీలపై ఫోకస్

మొదటి విడత ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు సాధించడంతో కాంగ్రెస్ జిల్లా నాయకులు రెండు, మూడో దశ ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఆయా గ్రామాల్లో కూడా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు సూచిస్తున్నారు. మరోవైపు తాజా గెలుపుతో ఉత్సాహంగా ఉన్న హస్తం పార్టీ శ్రేణులు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఫోకస్ పెట్టాయి. మెజారిటీ ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు గెలిచి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాయి.

## అనుమతి లేకుండా అబార్షన్లు చేస్తే ఆస్పత్రి సీజ్ చేస్తాం

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనుమతులు లేకుండా మహిళలకు అబార్షన్లు చేస్తే సీజ్ చేస్తామని జిల్లా వైద్యాధికారి విద్య హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శుక్రవారం గైనకాలజిస్టులు, పీడియాట్రిస్టులు, రేడియాలజిస్టులతో జిల్లాస్థాయి ఎంటీపీ (మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి విద్య మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎంటీపీ అమలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లా కార్యాలయం నుంచి ప్రత్యేక అనుమతి లేకుండా ఏ ప్రైవేట్ ఆస్పత్రి కూడా ఎంటీపీ ప్రక్రియను నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాంటి పనులు చేస్తే ఆస్పత్రి సీజ్ చేయడమే కాకుండా పర్మినెంట్‌గా మూసివేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం



ఎంటీపీల నిర్వహణకు ముందు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని ఆదేశించారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎమీమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి



**అక్షరటుడే, ఇందూరు :** సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కోరారు. నిజామాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి అంటే కేవలం పనులు ప్రారంభించడమే మాత్రమే కాదని, ప్రజల అవసరాలను అర్థం చేసుకొని సమయానికి అమలు చేయడం అన్నారు. సర్పంచ్‌గా ప్రజలతో అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేసే నాయకత్వం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వేదికలు, రేషన్ బియ్యం, శ్మశానవాటికలు, ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలను పారదర్శకంగా నడిపిపించాలంటే సమర్థుడైన నాయకుడితోనే సాధ్యమన్నారు. అలాగే నర్సరీలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, శుద్ధినీరు, రహదారులు, వెలుగులు, పరిశుభ్రత మొదలైన సంక్షేమ పథకాలను బీజేపీ మద్దతుదారులైన సర్పంచ్ అభ్యర్థులే చేయగలుగుతారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రెయినీ ఐఏఎస్ కరోలిన్‌కు సన్మానం



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మున్సిపాలిటీలో మూడు వారాలపాటు శిక్షణను పూర్తి చేసిన ట్రెయినీ ఐఏఎస్ అధికారి కరోలిన్ చింగ్తియాన్మావిని శుక్రవారం పురపాలక కార్యాలయంలో సత్కరించారు. కమిషనర్ గోపు గంగాధర్ శాలువా కప్పి, బొకే అందజేశారు. ఈ సందర్భంగా ట్రెయినీ ఐఏఎస్ మాట్లాడుతూ.. శిక్షణలో మున్సిపల్ చట్టాలు, పరిపాలనా విధానాలను క్షుణ్ణంగా పరిశీలన చేసే అవకాశం లభించిందన్నారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు అందించిన సహకారం మరిచిపోలేనిదని ఆమె వ్యాఖ్యానించారు. అనంతర కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ ట్రెయినీ ఐఏఎస్ శిక్షణకు వచ్చిన సమయంలో మున్సిపాలిటీలోని కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఐఏఎస్ అధికారి శిక్షణకు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షబ్బీర్, మున్సిపల్ ఏఈ శ్రీ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి: కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్ :** పంచాయతీ ఎన్నికల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ఈ మేరకు 17వ తేదీ మూడోవిడత పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో ముప్కాల్‌లోని రైతువేదికలో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సందేహాలు ఉన్నా ముందుగానే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. శిక్షణ తరగతులు సందర్శించిన సందర్భంగా కలెక్టర్ పీవోలకు కీలక సూచనలు చేశారు. హ్యాండ్‌బుక్‌లో పొందుపర్చిన అంశాలను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధులపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకోవాలని, ఎన్నిక ల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలని అన్నారు.

### విధివిధానాలపై అవగాహన

పీవోలు చేపట్టాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా



అమలు చేయాలని ఆదేశించారు. తప్పులు జరిగితే క్రమ శిక్షణ చర్యలకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఓటరు జాబితాలో పేరు ఉంటేనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించాలన్నారు. సమయపాలన పక్కాగా పాటించాలని, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి పోలింగ్ మెటీరియల్ తీసుకునే సమయంలో జాగ్రత్తగా పరిశీలించుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులలో ఆర్‌వోలు, పీవోలు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## కుక్కను తప్పించబోయి రోడ్డుపై పడి ఒకరి మృతి

**అక్షరటుడే, కోటగిరి:** కుక్కను తప్పించబోయి ఓ వ్యక్తి రోడ్డుపై పడి మృతి చెందాడు. ఈ ఘటన పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ మండలం సలాబత్‌పూర్ గ్రామానికి చెందిన షేక్ ఖాసిం (42) కూరగాయలు కొనడానికి పోతంగల్‌కు వస్తుండగా కుక్క అడ్డువచ్చింది. దానిని తప్పించబోయిన ఖాసిం రోడ్డుపై పడిపోయాడు. దీంతో స్పందించిన స్థానికులు అతడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. ఆయన కుటుంబీకురాలు షేక్ హసీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కేంద్ర, రాష్ట్ర నిధులతో గ్రామాల అభివృద్ధి: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి :** కేంద్ర, రాష్ట్ర నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కేంద్రం నుంచి రూ. 3వేల కోట్లు, రాష్ట్రం నుంచి రూ.3వేల కోట్లు రావాల్సి ఉందని, వాటితో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో గెలిచిన సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో షబ్బీర్ అలీ పాల్గొని గెలిచిన సర్పంచులకు అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షబ్బీర్ అలీ కీలక వ్యాఖ్యలు చేశారు.

### సగానికి పైగా కాంగ్రెస్ మద్దతుదారులే..

నియోజకవర్గంలో 102 పంచాయతీల్లో 58 సర్పంచ్ స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారని, 26 మంది బీఆర్ఎస్ మద్దతుదారులు, 12మంది బీజేపీ మద్దతుదారులు, 5 స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చిందని, అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనేనని ప్రజలు నమ్మి ఓటేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలంతా కాంగ్రెస్ వైపేనని మరోసారి నిరూపించారన్నారు. మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ స్వగ్రామంలో 30 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ మద్దతుదారుడు విజయం సాధించారని షబ్బీర్ అలీ తెలిపారు. అక్కడి ప్రజలు గంప గోవర్ధన్ నాయకత్వాన్ని కాదనుకుని కాంగ్రెస్ మద్దతుదారుడికి ఓటేశారని వ్యాఖ్యానించారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గెలిచినా వాళ్లు తమవారేనని చెప్పారు.



### కేటీఆర్ పారిపోయాడు..

జూబ్లీహిల్స్ ఎన్నికలు, సర్పంచ్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి రెఫరెండం అని చెప్పిన కేటీఆర్ పారిపోయారని షబ్బీర్‌అలీ విమర్శించారు. రాష్ట్రంలో 4వేల పైచిలుకు సర్పంచ్ స్థానాల్లో 2300లకు పైగా స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలిచారని తెలిపారు. గెలిచిన సర్పంచ్ అభ్యర్థులపై అనేక బాధ్యతలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో వారు ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అన్ని గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ సలహాదారు స్పష్టం చేశారు. ఇతర పార్టీల మద్దతుతో గెలిచిన అభ్యర్థులను బలవంతంగా తమ పార్టీలోకి తీసుకోబోమని, వారే స్వచ్ఛందంగా వస్తే వద్దనేది లేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుడు పండ్ల రాజు, శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాలో ఇష్టారాజ్యం




- బోధన్ మున్సిపల్ ఆఫీస్‌లో ఎవరిదారి వారిదే..
- కార్యాలయంలోనే అధికారుల బాహాబాహి
- ప్రజల సమస్యలు పట్టని సిబ్బంది
- ప్రక్షాళన కోసం ప్రజలు ఎదురుచూపులు

**బోధన్ బల్దియా కార్యాలయం నిర్లక్ష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడింది. అధికారులు సమయపాలన పాటించకపోవడంతో పాలన గాడితప్పింది. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనలో చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అధికారులు, సిబ్బంది ఆ పనులను గాలికి వదిలేసి కార్యాయంలోనే కొట్టుకునే స్థాయికి వచ్చారని తెలిసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.**

**– అక్షరటుడే, బోధన్**

బోధన్ పట్టణంలో సుమారు లక్ష వరకు జనాభా ఉంది. 38 వార్డులు ఉన్నాయి. సుమారు 150కి పైగా సానిటేషన్ సిబ్బంది పట్టణంలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు అది మరిచిపోయి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

### ఉన్నతాధికారులే ఆలస్యంగా..

ఇటీవల సబ్ కలెక్టర్ వికాస్ మహతో మున్సిపల్ కార్యాలయంలో సమీక్షకు రాగా.. ఏకంగా మున్సిపల్ కమిషనర్, మేనేజర్ ఇద్దరు కార్యాలయానికి హాజరు కాలేదు. ఉదయం 11 గంటలైనా ఉన్నతాధికారులు కార్యాలయానికి రాకపోవడంతో సబ్ కలెక్టర్ చేసేదేమీ లేక ఆయనే పలు ఫైళ్లను తనిఖీ చేసి వెళ్లిపోయారు. ఇలా ఉన్నతాధికారులే సమయపాలన పాటించకపోతే కిందిస్థాయి సిబ్బంది ఎలా పనిచేస్తారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### కార్యాలయంలోనే కొట్లాట..

సాక్షాత్తు మున్సిపల్ కార్యాలయంలోనే అధికారులు బాహాబాహికి దిగడం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని మున్సిపల్ ఆవరణలో గురువారం ఓ ఏఈ, వాటర్ వర్క్స్‌లో పనిచేసే మరో అధికారి ఇద్దరు ఎదురెదురుగా తారసపడ్డారు. అయితే తన బైక్‌ను తీసుకొస్తున్న సమయంలో అడ్డు తప్పుకోవాలని ఏఈ దురుసుగా మాట్లాడగా.. మరో అధికారి సైతం అదేస్థాయిలో సమాధానమిచ్చారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది.

### చొక్కాలు పట్టుకుని మరీ..

గొడవ కాస్తా పెరిగిపోయి వారిరువురు షర్ట్స్ పట్టుకుని కొట్టుకునేవరకు వెళ్లింది. వెంటనే స్పందించిన తోటి అధికారులు, సిబ్బంది వారిని విడిపించారు. అనంతరం వారిరువురు ఒకరిపై ఒకరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు సైతం చేసుకున్నారు. ఈ విషయమై బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణను వివరణ కోరగా తనకేమీ సమాచారం లేదని పేర్కొన్నారు. అయితే గతంలోనూ సదరు ఏఈ దురుసు ప్రవర్తన కారణంగా స్ట్రీట్ లైట్ విభాగంలో పనిచేసే ఉద్యోగి ఒకరు మనస్తాపంలో నాలుగైదు రోజులు కనిపించకుండా పోయాడని పలువురు పేర్కొన్నారు.

### ఎప్పటి నుంచో ఏఈ దురుసు ప్రవర్తన..

బోధన్ మున్సిపాలిటీలో దీర్ఘకాలంగా తిష్టవేసి కూర్చున్న సదరు ఏఈ దురుసు ప్రవర్తనపై ఉద్యోగులు ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు సైతం చేసినట్లు తెలిసింది. అయితే ఇప్పటివరకు సదరు ఏఈపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## వర్సిటీ వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ వాలీబాల్ టోర్నీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రిక శుక్రవారం వివరాలు వెల్లడించారు. కళాశాలలోని ఉపేక్ష, బి.కావేరి చెన్నైలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నీకి ఎంపికైనట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు క్రీడల్లో మరింత ప్రతిభ చూపి కళాశాలకు పేరు తేవాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, పీడీ రజిత అభినందించారు.

## రైతువేదికలో అధికారులకు శిక్షణ



**అక్షరటుడే, మెండోరా:** మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రీసైడింగ్ ఆఫీసర్లకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎలాంటి సందేహాలున్నా అవగాహన సదస్సులో నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎన్నికల విధానాలు, పోలింగ్ ప్రక్రియ, బాధ్యతలు, అనుసరించాల్సిన నిబంధనలపై అధికారులకు ఆయన అవగాహన కల్పించారు.

## భిక్కనూరును ఆదర్శ జీపీగా తీర్చిదిద్దుతా



**అక్షరటుడే, భిక్కనూరు:** భిక్కనూరును ఆదర్శ జీపీగా తీర్చిదిద్దుతానని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బల్యాల రేఖ సుదర్శన్ పేర్కొన్నారు. సర్పంచ్‌గా విజయం సాధించిన అనంతరం ఆమె ఎన్నికల అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. భిక్కనూరు మండలంలో పంచాయతీ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. భిక్కనూరు మేజర్ పంచాయతీ కావడంతో ఓట్ల లెక్కింపు కార్యక్రమం గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మద్దతుదారైన బల్యాల రేఖ సుదర్శన్ భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆమె తన సమీప అభ్యర్థి సరితపై 1,279 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2006 నుంచి 2011 వరకు బల్యాల రేఖ భిక్కనూరు ఎంపీపీగా పనిచేశారు. భిక్కనూరు మండల కేంద్రంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ఇంతపెద్ద మొత్తంలో మెజారిటీతో గెలవడం ఇదే మొదటిసారి అని పలువురు పేర్కొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను తప్పక నెరవేరుస్తుందని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పై నమ్మకం ఉంచి గ్రామ సర్పంచ్ ఎన్నికలలో పార్టీ మద్దతుదారులను గెలిపించినందుకు ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మొదటి విడతలో 184 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగితే అందులో సుమారు 140 స్థానాలు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు విజయం సాధించారని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి నమ్మకముందనే విషయం ఈ ఎన్నికల్లో రుజువైందని ఆయన వెల్లడించారు.

### ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ప్రజాపాలనను గమనిస్తున్న ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో తమకు అనుకూలంగా తీర్పునిచ్చాయని నగేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులుగా గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలుపుతూనే వారి విజయానికి కారకులైన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇల్లు లేని పేద ప్రజలకు ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు అందిస్తున్నామని వివరించారు.

### గత బీఆర్ఎస్ హయాంలో..

గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రైతుల కోసం రైతు రుణమాఫీ చేశామని, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. రైతు భరోసా పేరుతో ఎకరానికి ఏడాదికి రూ.12 వేల అందిస్తున్నామన్నారు. ఇలా అనేక సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నందునే ప్రజలు తమవైపు నిలబడ్డారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పాగంగారెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, సేవాదల్ అధ్యక్షుడు సంతోష్, ఓబీసీ అధ్యక్షుడు రాజ నరేందర్ గౌడ్, మహమ్మద్ ఈసా, అబ్దుల్ ఎజాజ్, సాయికిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. తమ పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి మంగళారపు ప్రణవ్ కుమార్, 5వ తరగతి విద్యార్థి పిడుగు శివ జాతీయ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో లీడ్ సంస్థ ఆధ్వర్యంలో పలురకాల ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నట్లు ఆయన వివరించారు. నవంబర్ చివరివారంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ప్రతిభ చూపిన ఈ ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. మంగళారపు ప్రణవ్ కుమార్ జాతీయ సైన్స్ ఛాంపియన్‌షిప్‌కు, పిడుగు శివ జాతీయ ఇంగ్లిష్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్, అడ్మినిస్ట్రేటర్ పద్మ, అకడమిక్ కోఆర్డినేటర్ జ్యోతి ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మానస గణేష్ మాట్లాడుతూ..విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## శబరిమలకు బయలుదేరిన భక్తులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కాలం పాటు అయ్యప్ప దీక్ష చేపట్టిన భక్తులు శుక్రవారం ఇరుముడి కట్టుకొని శబరిమల బయలుదేరారు. ఉదయం అయ్యప్ప ఆలయంలో గణపతి హోమం నిర్వహించి పడిపూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గురుస్వాములు చంద్రం, శ్రీనివాస్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు అయ్యప్ప భక్తులతో కలిసి ఇరుముడిని పట్టుకొని భక్తిశ్రద్ధలతో శబరిమలకు పయనమయ్యారు. ఎల్లారెడ్డి నుంచి మొదటిసారిగా వెళ్తున్న అయ్యప్ప భక్తులకు తోటి అయ్యప్ప మాలధారణ భక్తులు భక్తి పాటలు పాడుతూ వీడ్కోలు పలికారు.

## అబార్షన్‌తో మాకు సంబంధం లేదు..


**స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల వింత సమాధానం**

**అక్షరటుడే, కామారెడ్డి:** 'ఓ అమ్మాయి కడుపునొప్పి అని మా దగ్గరకు వచ్చింది. స్కాన్ చేస్తే ప్రెగ్నెన్సీ బయటపడింది. అంతే తప్ప అబార్షన్ ఘటనపై మాకు ఎలాంటి సంబంధం లేదు.' ఇటీవల పెళ్లికాని యువతికి అబార్షన్ చేసిన ఘటనపై వైద్యశాఖ నుంచి నోటీసు అందుకున్న స్కానింగ్ సెంటర్ యాజమాన్యం సమాధానం ఇది.

### షోకాజ్‌కు పొంతనలేని సమాధానం..

ఇటీవల ఓ అమ్మాయి గర్భం దాల్చగా ఆమెకు అబార్షన్ చేసిన ఘటనలో స్కానింగ్ సెంటర్‌కు, ఓ ఆస్పత్రికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే అధికారుల నోటీసుపై స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పొంతనలేని సమాధానం ఇచ్చినట్లుగా తెలిసింది. సదరు అమ్మాయి తన సెంటర్‌కు కడుపునొప్పి అని వచ్చిందని స్కాన్ చేస్తే ప్రెగ్నెన్సీ బయటపడిందని పేర్కొంది. అంతే తప్ప ఈ ఘటనలో తమకు ఎలాంటి సంబంధం లేదని చేతులు దులుపుకునే ప్రయత్నం చేసిందని సమాచారం. ఈ రకమైన సమాధానాన్ని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమర్థిస్తారా లేదా అనేది వేచి చూడాలి.

## ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శుక్రవారం మండలంలో పర్యటించారు. మండల కేంద్రంతో పాటు బేగంపూర్, కాస్లాబాద్, వడ్లం, బూరుగుపల్లి, సముందర్ తండా, జగన్నాథ పల్లి, చిన్న తక్కడపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులైన సర్పంచ్ అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకులు జుక్కల్ నియోజకవర్గాన్ని విస్మరించారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇక ముందు కూడా అనేక అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి మరింత జరగాలంటే ప్రజలు కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధారిలో పోలీసు కవాతు



**అక్షరటుడే, గాంధారి:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం గాంధారి మండల కేంద్రంలో పోలీసు కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ సంతోష్ కుమార్, స్థానిక ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసు కవాతు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేక బలగాలను మోహరించామన్నారు. ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## బస్సు అద్దాలు ధ్వంసం..

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** బస్సు అద్దాలను ధ్వంసం చేసిన ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో హైదరాబాద్ డిపోకు చెందిన బస్సులో ఓ యువకుడు ఎక్కాడు. చిన్నకొడప్‌గల్ వద్ద ఆపాలని కోరాడు. అయితే ఈ బస్సు చిన్నకొడప్‌గల్ వద్ద ఆగదని కండక్టర్ చెప్పారు. దీంతో కోపోద్రిక్తుడైన ఆ యువకుడు బస్సు వెనక అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో అతడిని పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పజెప్పారు. యువకుడు రాందాస్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు



**అక్షరటుడే, ఇందూరు:** వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్ఈ (ఆపరేషన్స్) రాజేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులంతా కలిసి జిల్లాను ముందు వరసలో నిలబెట్టాలన్నారు. పొలంబాట, పట్టణ బాట నిర్వహించి వినియోగదారులకు విద్యుత్ భద్రత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని నియంత్రికలు పాడవకుండా జాగ్రత్త పడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్‌లను తగ్గించాలని డీటీఆర్‌లను ఇన్‌స్పెక్షన్ చేసి బాగు చేయాలన్నారు. సమావేశంలో టెక్నికల్ డీఈ రమేష్, ఎస్ఏఓ శ్రీనివాస్, డీఈలు ఎం. శ్రీనివాస్, ఎండీ ముక్తార్, వెంకటరమణ, హరిచంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ప్రచారం.. వాహనం సీజ్

**అక్షరటుడే, బాన్సువాడ:** పంచాయతీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ప్రచారం చేసిన ఘటనపై ఎఫ్ఎస్‌టీ టీం చర్యలు తీసుకుంది. బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో అనుమతి లేకుండా ఫుట్‌బాల్ గుర్తుతో, సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకుని రోడ్లపై తిరుగుతున్న ఆటోను అధికారులు పట్టుకున్నారు. అనుమతి పత్రాల గురించి విచారించగా ఏ విధమైన ప్రచార అనుమతి పొందలేదని తేలడంతో అధికారులు వెంటనే ఆ ఆటోను సీజ్ చేశారు. అనంతరం ఫుట్‌బాల్ గుర్తు అభ్యర్థి, ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తుల శ్రీధర్ తెలిపారు. మండల పరిధిలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.